క్లుప్తంగా

పద్మశాలి సంఘం మండల కమిటీ


సంతోష్ కుమార్

పెద్దవంగర : పద్మశాలి సంఘం సమావేశం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పెండెం రమేష్, సహాయ కార్యదర్శి కందగట్ల సోమశేఖర్, చిట్యాల శంకర్ సమక్షంలో ఏర్పాటు చేయగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాపోలు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులుగా సదానందం, వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఆడెపు సంజీవ నియమితులయ్యారు. కార్యక్రమంలో తొర్రూరు పద్మశాలి సంఘం నాయకులు కోట వెంటేశ్వర్లు, కస్తూరి పులేందర్, లక్ష్మీనారాయణ, పరమేశ్వర్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

మరిపెడ రూరల్: మండలంలోని తానంచర్లకు చెందిన పాశం గోపయ్య మాతృమూర్తి పాశం నర్సయ్య (105) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్, నర్సమ్మ మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, నాయకులు అచ్చుత్‌రావు, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

ద్వితీయ స్థానంలో చిన్నగూడూరు

చిన్నగూడూరు : తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో చిన్నగూడూరు ద్వితీయ స్థానంలో నిలిచిందని ఎంపీపీ వల్లూరి పద్మ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలలో చిన్నగూడూరు మండలం ద్వితీయ స్థానంలో నిలవడంతో క్రీడాకారులను అభినందించి టీ-షర్ట్‌లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు పుష్పలీల, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేసముద్రం: కేసముద్రం విలేజ్‌కి చెందిన కందుకూరి శంకర్‌చారి గుండెపోటుతో, కదిర రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి బాధిత కుటుంబాలకు పరామర్శించి అందజేశారు. ఆయన వెంట బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గాంతి వెంకట్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రడం వెంకన్న, పాల్గొన్నారు.

వృద్ధుల ఆరాటం



కొత్తగూడ : ఏజెన్సీలో మూడో పంటగా పేరొందిన తునికాకు సేకరణ లో ఆయా గ్రా మా ల ప్రజలు నిమగ్నం అయ్యారు. గంగారం మండలం కామా రం గ్రామానికి చెందిన నర్సక్క, లచ్చక్క సు మారు 80 ఏళ్ల వృద్ధులు కొత్తగూడ మండలం కర్నెగండి అటవీ ప్రాంతానికి నాలుగు కిలో మీటర్లు నడిచివచ్చి తునికాకు కోసం వెళ్తున్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

బయ్యారం : పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని తహసీల్దార్ రమేష్ ప్రారంభించారు. అనంతరం టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడుకుంటూ సామాజిక బాధ్యతగా 2 వేల మందికి మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు.

కూల్..కూల్‌గా ప్రయాణం



మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ ఆటోడ్రైవర్ వినూత్న ఆలోచనతో చల్లచల్లగా స్వచ్ఛమైన ఏసీలో ప్రయాణికులను గమ్యస్థానానికి తీసుకెళ్తున్నాడు. మండలంలోని దర్గ తండాలోని అంజి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. వేసవి కాలంలో ప్రతి ఏటా తన ఆ టోపై గోనె సంచులను ప్రత్యేకంగా తయారు చేసుకొని ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందుతున్నాడు. ఈసారి ఎండలు దంచి కొట్టడంతో గోనెసంచులు ఆటోకు అమర్చి అందులో వడ్ల గింజలు వేసి నీరు పోస్తున్నాడు. ప్రయాణికులే దేవుళ్లని వారిని సురక్షిత ప్రాంతంలోకి చేర్చడమే తన లక్ష్యమన్నారు.

కాళేశ్వరం నీటితో పల్లెలు కళకళ

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

దంతాలపల్లి: కాళేశ్వరం నీటితో మండలాన్ని కళకళలాడించి రెండు పంటలు పండించేలా చేసిన ఘనత బీఆర్ఎకే దక్కుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని రామానుజాపురం, వేములపల్లి, పంతులుతండా, దొనకొండ గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తుత మానుకోట జిల్లాకు చివర ఉన్న ఈ గ్రామాలు గతపాలకు నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి ఆమడదూరంగా ఉండేవన్నారు. ఈ ప్రాంతం నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా డోర్నకల్ నియోజకవర్గంలో చేరాక ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశానన్నారు. దొనకొండలో రెండు సీసీ రోడ్లు, వైకుంఠధామం ప్రారంభించటంతో పాటు వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మారపు వేణు, ఎంపీపీ ఉమా, రైతు మండల సమితి కోఆర్డినేటర్ ఒలాద్రి మల్లారెడ్డి, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషోర్, తహసీల్దార్ శివాని, ఎంపీడీఓ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక


వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన యువకులు

గార్ల(డోర్నకల్): హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 28నుంచి నిర్వహించే సీఎం కప్ రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ముగ్గురు యువకులు ఎంపికై నట్లు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ సెక్రటరీ సుధాకర్, టీం మేనేజర్ లక్ష్మణ్ తెలిపారు. డోర్నకల్‌లోని భారత్‌వీర్ వ్యాయామశాలలో బుధవారం జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 55 కేజీల విభాగం నుంచి యశ్వంత్‌నాయక్, 61 కేజీల విభాగం నుంచి చేతన్ కుమార్, 67 కేజీల విభాగం నుంచి మహేందర్ ఎంపికైనట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గార్ల: బాస్కెట్‌బాల్ అండర్-16 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు గార్లకు చెందిన ఉప్పరి శ్రీవేక్ సిద్ధార్థ, ధనుష్ సిద్ధార్థ ఎంపికై నట్లు సీనియర్ బాస్కెట్‌బాల్ కోచ్ సూత్రపు జయశంకర్ బుధవారం తెలిపారు. సూర్యాపేటలో గురువారం జరిగే బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు పేర్కొన్నారు. ఎంపికై న వారిని పీఈటీ రామన్న, స్థానికులు అభినందించారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ధ్వజం

● మండల సర్వసభ్య సమావేశం


సభలో ఈజీఎస్ అధికారిని ప్రశ్నిస్తున్న సర్పంచ్

నెల్లికుదురు: మండల సర్వ సభ్య సమావేశం గరంగరంగా సాగింది. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి అధ్యక్షతన నిర్వహించిన సభలో వివిధ గ్రామాల్లో డబుల్ బెడ్‌రూం ఇల్లు నిర్మించుకున్న వారికి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లిలో ఎవ్వరిని అడిగి డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులను ఎంపిక చేశారని అధికారులను ప్రశ్నించారు. ఉపాధి హామీలో ఏం జరుగుతుందో తెలవడం లేదని మదనతుర్తి, నర్సింహులగూడెం సర్పంచ్‌లు ప్రశించారు. 11 కేవీ విద్యుత్ తీగలపై అధికారులు పట్టించుకోవడం లేదని మదనతుర్తి సర్పంచ్ సభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. గ్రంథాలయ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎంఈఓ గుగులోతు రాము మండల సభకు విజ్ఞప్తి చేశారు. వివిధ శాఖలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషాద్రి, డిప్యూటీ తహసీల్దార్ తరంగిణి, వైస్ ఎంపీపీ జెల్ల వెంకటేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలి

గార్ల : స్థానిక నెహ్రూ సెంటర్‌లోని నెహ్రూ విగ్రహాన్ని తెల్లవారుజామున గుర్తుతెలియని లారీ ఢీకొట్టడంతో విగ్రహం పిల్లర్లు దెబ్బతిన్నాయని మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు దెబ్బతిన్న నెహ్రూ విగ్రహం ప్రాంతాన్ని పరిశీలించారు. మండల పార్టీ అధ్యక్షుడు దనియాకుల రామారావు మాట్లాడుతూ పోలీసులు నెహ్రూ సెంటర్‌లోని సీసీ కెమెరాల ఆధారంగా విగ్రహాన్ని ఢీకొట్టిన లారీని గుర్తించి, లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, మరమ్మతులు చేయించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

అగ్నికి ఆహుతైన హరితహారం చెట్లు

చిన్నగూడూరు : హరితహారం పథకంలో భాగంగా రోడ్ల వెంబడి నాటిన మొక్కలు అగ్నికి ధ్వంసమైన సంఘటన మండలంలోని చేపూరి తండా వద్ద చిన్నగూడూరు-మహబూబాబాద్ రహదారిపై చోటు చేసుకుంది. రైతులు తమ పంటలను నూర్పిడి చేసి మిగిలిన వ్యర్థాలను రోడ్ల వెంబడే కాల్చివేయడంతో గాలి దుమారానికి రోడ్డు వెంబడి ఉన్న హరిత హారం చెట్లకు నిప్పు అంటుకొని కాలిపోయాయి.

గడ్డివాము దగ్ధం

కేసముద్రం : నిప్పంటుకుని రెండెకరాల గడ్డివాము దగ్ధమైన సంఘటన ఇనుగుర్తి మండలం తారాసింగ్ తండా జీపీ శివారు బావోజీ తండాలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..తండాకు చెందిన రాంజీ రెండెకరాల గడ్డిని ఇంటి సమీపంలో పేర్చాడు. వాముకు ప్రమాదశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు వ్యాపించాయి, మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

బీఆర్ఎస్‌లో చేరిక

దంతాలపల్లి: మండలం వేములపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సమారు 30 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే రెడ్యానాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పేదలకు అండ సీఎంఆర్‌ఎఫ్

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: పేదలకు అండ సీఎంఆర్ఎఫ్ అండ అని స్థానిక ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధుల కోసమే సీఎంఆర్ఎఫ్ అన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు.మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తేళ్ల శ్రీనివాస్, వెంకటకృష్ణారెడ్డి, గోగుల రాజు, పాల్గొన్నారు.

గిరిప్రసాద్ సేవలు మరువలేనివి



గార్ల : గిరిప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

నెహ్రూసెంటర్ : భూమి, భుక్తి, విముక్తి కోసం కృషి చేసిన కమ్యూనిస్టు ఉద్యమ నేత, సీపీఐ మాజీ జాతీయ ఉపకార్యదర్శి నల్లమల గిరిప్రసాద్ సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గిరిప్రసాద్ 26వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లెఫ్ట్ డెమోక్రసీ ఫ్రంట్ ఏర్పాటు చేసి దేశంలో ప్రజల సమస్యలపై అహర్నిశలు పోరాడిన మహనీయుడు గిరిప్రసాద్ అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, పోగుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గార్ల: సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి, ఖమ్మం మాజీ ఎంపీ నల్లమల గిరిప్రసాద్ 26వ వర్ధంతిని బుధవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, భరత్, యశ్వంత్, నాగయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రెడ్యాను నిలదీసిన రైతులు


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రైతులు

దంతాలపల్లి : మండలంలోని వేములపల్లిలో రైతులు మా ధాన్యం పరిస్థితి ఏమిటని ఎమ్మెల్యే డీఎస్. రెడ్యానాయక్‌ను నిలదీశారు. బుధవారం గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసేందుకు గ్రామానికి వస్తున్న సమయంలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుకొని నిలదీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థాపించి రెండు నెలలు కావస్తున్నా కాంటాలు నిర్వహించి బస్తాలు నెట్టు వేసి చాలా రోజులు గడుస్తుందని రైతులు ఆవేదన వెలిబుచ్చారు. కొనుగోలు కేంద్రం వద్ద తాగు నీరు, కరెంటు సౌకర్యం లేక రైతులు అనేక ఇబ్బంది పడుతున్నారని మొరపెట్టుకున్నారు. రైతుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో మాట్లాడి వారం రోజుల్లో ధాన్యం గింజ లేకుండా తరలించేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు విరమించుకున్నారు.కార్యక్రమంలో రైతులు పర్శయ్య, పుల్లయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీ సహజం


బదిలీపై వెళ్తున్న డాక్టర్లను సన్మానిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాజేష్

గార్ల : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజం అని గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేష్ అన్నారు. సీహెచ్‌సీలో ఇటీవల బదిలీపై వెళ్లిన డాక్టర్లు రాణాప్రతాప్, మహిరాజ్, చైతన్య, సిబ్బంది ఎల్‌టి ఉమ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు ఇంకా పదోన్నతులు పొంది ఉన్నతస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు హనుమంతరావు, సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, డాక్టర్ సాయిలక్ష్మి, డాక్టర్ జ్యోతి, రమాదేవి, శాంత, నాగమణి, సరిత, స్రవంతి, జ్యోతి, ప్రవీణ, ఉషారాణి, విలియమ్, తార, సుందర్, సరోజ, పుష్ప, వీరేందర్, వినోద్, గోరి, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి


ప్రీ స్కూల్ డే వేడుకలో పాల్గొన్న డీడబ్ల్యూఓ వరలక్ష్మి

గూడూరు: పిల్లల చదువు, ఆరోగ్యంపై తల్లిదండ్రులతో పాటు అంగన్‌వాడీ టీచర్లు శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ డీడబ్ల్యూఓ వరలక్ష్మి అన్నారు. మండలంలోని ఏపూరు సమీప శివనాయక్‌తండా, దస్రుతండా, చంద్రుగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రీ స్కూల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్య పూర్తి చేసుకుని ప్రైమరీ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు వార్షికోత్సవ వేడుకలను నిర్వహించి వారికి సర్టిఫికెట్లు అందించారు. అనంతరం పోషకాహారంపై తల్లిదండ్రులకు, గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ నీలోఫర్ అజ్మీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు, ఆటో ఢీ..ఆరుగురికి తీవ్రగాయాలు



మహబూబాబాద్ రూరల్ : కారు అతివేగంతో వచ్చి ఆటోను ఢీకొనడంతో అందులో ఉన్న తొమ్మిది మందిలో ఐదుగురికి తీవ్రగాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్పగాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బి.రాంచరణ్ కథనం ప్రకారం.. ఇల్లందు మండలం తొమ్మిది మైళ్లతండకు చెందిన 10 మంది ఓ ఆటోలో బయ్యారం మండలం మీదుగా మహబూబాబాద్ వైపునకు వస్తున్నారు. వీరంతా కురవి మండలం ఎలుకచెట్ల తండ పరిధిలోని మెగ్యాతండాలో ఓ కార్యానికి హాజరయ్యేందుకు వెళ్తున్నారు. గమ్యస్థానానికి చేరుకోకుండానే మార్గమధ్యలో అనంతారం సమీపంలో ఆటోను ఎదురుగా బయ్యారం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. స్థానికులు క్షతగాత్రులను వెంటనే హుటాహుటిన 108 వాహనంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ఉన్న వారిలో లాల్ సింగ్, సోనా, మురళి, కోటియా, సుజాత, శ్రీనులకు తీవ్రగాయాలు కాగా, హరిత, భావన, బుచ్చలకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కురవి: అత్తమామ, భర్త వేధింపులు తాళలేక వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలంలోని రాజోలులో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. రాజోలుకు చెందిన నాళం సురాంభ-వెంకన్నల కుమార్తె మానస అదే గ్రామానికి చెందిన గునిగంటి సురేందర్‌ను గత ఏడాది ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. పెళ్లయిన నాటి నుంచి భర్త, అత్త, ఆడబిడ్డలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని బాధితులు తెలిపారు. వేధింపులు తాళలేక మానస పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితులు కురవి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

దంతాలపల్లి : మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లి మండల పరిధిలోని తూర్పుతండాలో ప్రమాదవశాత్తు వ్యక్తి బావిలో పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. తండావాసులు, పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు తండాకు చెందిన గుగులోత్ రెడ్డి (35) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రి ఇంటికి రాకపోవడంతో మృతుడి తండ్రి సక్రు బుధవారం పొలం వద్దకు వెళ్లి బావిలో చూడగా రెడ్డి చనిపోయి ఉన్నాడు. పోలీసులు ఘటన స్థలికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి సక్రు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

తొర్రూరు రూరల్: మండలంలోని దుబ్బతండ, అమర్‌సింగ్ తండాల్లో సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గండ్రాతి సతీష్ మాట్లాడుతూ 500 లీటర్ల బెల్లం పానకాన్ని, 20 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేసి, 2 క్వింటాల బెల్లం, 10 కేజీ పటికను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా గుడుంబాను తయారు చేస్తున్న బీ.వెంకన్న, అమీనాపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నెల్లికుదురు : మండలంలోని ఆలేరులో దాడులు నిర్వహించి 13 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం.. గ్రామంలో సోదాలు చేయగా గ్రామానికి చెందిన గుండేటి మంగమ్మ, సురుగు వెంకటమ్మ, గుండెపాక యాకమ్మ నాటుసారా కాస్తు పట్టుబడినట్లు తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని హైమావతి, సాయిమల్లు పరారీలో ఉన్నారని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బయ్యారం/చిన్నగూడూరు: పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేయడంతో హర్షిస్తూ బుధవారం మండల కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యాను కలిసి శాలువాతో సత్కరించారు.

కళ్లలోంచి ఎలాంటి వ్యర్థాలు రాలేదు

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన ఆరేళ్ల పాప సౌజన్యను పీహెచ్‌సీ డాక్టర్ అవినాష్ బుధవారం ఆమె ఇంటికి వెళ్లి ఖమ్మం వైద్యుల రిపోర్ట్‌లను పరిశీలించారు. కళ్లలోంచి బియ్యం గింజలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని తల్లిదండ్రులు భూక్యా దస్రూ-దివ్యలు ఆందోళన చెందిన విషయం విదితమే. తల్లిదండ్రులు భయాందోళనకు గురై ఖమ్మం మమత ఆస్పత్రిలో వైద్యుల సూచన మేరకు 3 రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచి బుధవారం సౌజన్యను ఇంటికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న డాక్టర్ అవినాష్ వైద్యుల రిపోర్ట్‌లను పరిశీలించగా అన్ని సాధారణంగానే ఉన్నాయని పేర్కొన్నారు. 3 రోజుల పాటు సౌజన్య కళ్ల నుండి ఎలాంటి వ్యర్థాలు రాలేదన్నారు. సౌజన్య కళ్లలో బియ్యం గింజలు, గోర్లు, ప్లాస్టిక్ సంబందించిన వస్తువులు పెట్టుకొని ఉండవచ్చని మమతా హాస్పిటల్ వైద్యులు తెలిపినట్లు వెల్లడించారు. ప్రస్తుతం సౌజన్య ఆరోగ్యంగా ఉన్నట్లు తల్లిదండ్రులు పాప నడవడికలను ఎల్లవేళలా గమనించాలని డాక్టర్ సూచించారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

చిన్నగూడూరు : మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్సై గండ్ర సంతోష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహబూబాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో పోలీస్ సిబ్బందితో వాహనదారులను ఆపి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని అన్నారు. .

అంబేడ్కర్ ఆశయాలను సాధించాలి



కురవి : అంబేడ్కర్ ఆశయాలను సాధించాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు జీపీ రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి అన్నారు. సీరోలు మండలం ఉప్పరిగూడెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డోర్నకల్ నియోజకవర్గ బాధ్యుడు మాలోత్ నెహ్రూ నాయక్, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐలయ్య, జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, సర్పంచ్ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

కేసముద్రం : మండల కేంద్రంలోని శివారు బ్రహ్మంగారి తండాలో ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ బట్టు శ్రీనివాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ఊరు-మన బడి కింద పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.23 లక్షల నిధులను మంజూరు చేసిందన్నారు. అలాగే ఈజీఎస్ కింద రూ.16 లక్షలతో వరండా, టాయిలెట్స్, ప్రహరీ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలకు నూతన భవనం నిర్మిస్తుండడంపై తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ ముత్యాల నాగమణి, శివకుమార్, వార్డుసభ్యురాలు బానోతు పద్మ, బాలునాయక్, భద్రునాయక్, పీఆర్ఏఈ మానస, ఈవో అశోక్‌కుమార్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఖాదర్, పాల్గొన్నారు.

46 మంది బైండోవర్

మహబూబాబాద్ రూరల్: మానుకోట కలెక్టర్ కార్యాలయం వెనుక గల 255/1 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుడిసెలు వేసిన వారిలో 46 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని టౌన్ ఎస్సై విజయరాంకుమార్ బుధవారం తెలిపారు. గుడిసెల తొలగింపు సందర్భంగా ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ వారికి సంఘీభావంగా వెళ్లిన సీపీఎం నాయకులతో పాటు మరికొంత మందిని పోలీసులు అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గుడిసెల తొలగింపు సందర్భంగా జరిగిన తోపులాటలో బానోత్ శ్రీను, బానోత్ బాలగోపాల్‌లకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

కంపెనీ నుంచి నష్టపరిహారం ఇప్పించాలి



తొర్రూరు : మోసగించిన మిరప విత్తన కంపెనీ నుంచి నష్టం ఇప్పించాలని బాధిత రైతు వినియోగదారుల సమాచార కేంద్రం ఇన్‌చార్జ్‌ను కోరారు. బుధవారం డివిజన్ కేంద్రంలో డీసీఐసీ ఇన్‌చార్జ్ వింజమూరి సుధాకర్‌కు కురవి మండలం టేకుల తండాకు చెందిన రైతు ధరంసోతు చందూలాల్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ పెస్టిసైడ్స్, సీడ్స్ సంస్థ నాసిరకం మిరప విత్తనాలు అంటగట్టడంతో మూడు ఎకరాల్లో వేసిన మిరపపంట దిగుబడి రాలేదని అన్నారు. సాగుకై రూ.5 లక్షల మేర పెట్టుబడి పెట్టానని, తనకు నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. సుధాకర్ మాట్లాడుతూ కంపెనీకి నోటీసులు పంపి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని తెలిపారు.